ఆపలేదు భద్రం నించుని. "నే నెడుతున్నానండీ" అన్న మాటలు అతనికి వినబడలేదు.

* * *

మరునాడు మళ్లీ రాజారావును కలుసుకోవాలని వచ్చిన భద్రాన్ని గదికి వేసి ఉన్న తాళం వెక్కిరించింది.

ఓపది రోజులు పోయాక భద్రానికి ఫ్రమ్ అడ్రెస్ వ్రాసి ఉన్న కవరొకటి వచ్చింది.

"డియర్ భద్రం,

నాకన్నా వయస్సులో చిన్నవాడి వయినా మనస్సులో పెద్దవాడివి. అనేక సందర్బాల్లో నువ్వు వెలిబుచ్చిన అభిప్రాయాలు నాకు తెలియనివి కావు, కానీ, తాను చెప్పేవాటిని ఆచరించీ చూపించే వాడిని నిన్నొక్కడినే చూశాను. అందుకనే ప్రభావితుడనయ్యాను.

నేటినుండి నా జీవితనౌక తన దిక్కుమార్చుకోబోతూంది. కారణమేమిటంటే, నేను రాజేశ్వరిని రిజిస్టర్డ్ మారేజి చేసుకోబోతున్నాను. ఆమెకు పుట్టిన వాడు నాకొడుకే- విశాఖపట్నంలో ఎమ్.ఏ. చదువుతున్నప్పుడు ఆమెతో నేను చేసిన స్నేహఫలితమే. ఆడవాళ్ల పట్ల , అందునా పంతులమ్మల పట్ల నాకున్న భావాలను నువ్వు వమ్ము చేశావు. ఈ ప్రయత్నంలో ఉదాహరణగా నా రాజేశ్వరినే నాకు చూపించావు. ఇందుకు నేను నీ కెంతగానో ఋణపడి ఉన్నాను. నీ జీవితం స్టవ్ వంటిది. చేతనైనంత వెలుగును చీకట్లో ఉన్న నా జీవితానికిచ్చింది. పెర్ఫెక్షనుకు ఇంకా దగ్గరగా నువ్వు జీవించటం ద్వారా నీ జీవితం ఒక జ్యోతి అయి పదుగురికీ మార్గదర్శకమవుతుందనీ ఆశిస్తున్నాను. పెళ్ళికి నిన్నొక్కడ్నే ఆహ్వానిస్తున్నాను. కాంపింగ్ ఉన్నా మానుకుని వస్తావు కదూ?

నీ ఆత్మ బంధువు,

-రాజారావు."

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 25-7-73)

* * * * * * * * *

# హామీ

" ఒకలైలా కోసం, టుఁయ్,టుఁయ్,టుఁయ్, తిరిగాను లోకం , టుఁయ్,టుఁయ్,టుఁయ్, ప్రతి పగలూ, ప్రతి రాత్రి గుర్‌ర్‌ర్‌ర్... - హాలో హలో మైక్ టెస్టింగ్... అయ్యా, అమ్మా, సమస్యల్తో వేగిపోయే మీ కందరికీ శుభవార్త! ప్రజల అనారోగ్యాన్ని .. ఒక లైలా కోసం. బాగు చెయ్యాలనే ఉద్దేశంతో.. ఒక లైలా కోసం... మేము కనిపెట్టిన అద్భుతమైన చర్మరోగ నివారిణి చర్మ రంజనిని చాలా తక్కు ధరలో అమ్ముతున్నాం.. ఒక లైలాకోసం... పప్పు తామర, కొప్పు తామర, ఉప్పు తామర, నిప్పు తామర వగైరా ఏడు రకాల ముప్పు తామరలనూ, అయిదు రకాల గజ్జిలనూ, .. ఒక లైలా కోసం .. నివారించి, నిర్మూలించి, నిశ్శేషించి, నాశనం చేసేస్తుందండీ మా యీ చర్మ రంజని. పాకెట్టు రూపాయి మాత్రమే. నమ్మండి బాబూ.. ఒక లైలాకోసం . సంవత్సరం వస్తుంది, పెద్ద పాకెట్టు కొనండి బాబూ, రెండ్రూపాయలు, మూడేళ్ళొస్తుంది .. తప్పుకోరా కొడకా, నా బండికి నీబండి అడ్డుపెడతావేంట్రా!.. నన్ను పోనీ... హలో, ఇంకో సెంటర్‌కి బండి వెళ్ళిపోతోందండి, కావాల్సినవాళ్లు బండి దగ్గరకొచ్చి కావల్సినవన్నీ పాకెట్టు

తీసుకోగలరు. ఒక లైలా కోసం...''

★ ★ ★

'' అద్దాలమేడ ఉందీ, అందాల భామ ఉందీ, మత్తైన మందుఉందీ, రా,రా, రా.. అం ఏమండోయ్, మిమ్మల్నే!.. నేనండీ లక్ష్మిని! లక్ష్మి పిలుస్తోందండీ మిమ్మల్ని! చుట్టూ చూస్తే ఏం లాభమండీ! ఇటు, ఇటు చూడండి సార్... మీ లక్ష్మి ఉన్నదిక్కడేనండీ సార్! ... అబ్బ ఈ లక్ష్మి మీ లక్ష్మి కావాలని మీరు కోరుకుంటున్నట్టు తెలుసు సార్!... అద్దాలమేడ ఉందీ... సార్, హఠాత్తుగా ఒక్క రోజులో మీరు.. అందాల భామ ఉందీ... లక్ష్మి చెయ్యి పట్టుకుని అనందించే ఉపాయం , ఇక్కడే, ఇక్కడే ఈ రిక్షాలోనే ఉంది... రా,రా, రా... రా బాబూ రా, అదృష్టం ఎప్పుడు ఎవర్ని ఎక్కడ ఏ రూపంలో ఎట్లా వరిస్తుందో చెప్పలేం... బాబూ, 'సౌభాగ్యలక్ష్మి ' డ్రా రేపే, రేపే! రేపు సాయంత్రం ఈ టైముకి లక్షాధికారి అయిపోయేదెవరు? మీరా, మీరా, మీరా? ఆఫీసరుగారూ మీ రవ్వక తప్పదండీ! సిల్కుచీరా సన్ననడుమూ స్టూడెంటమ్మా, మీరవ్వక తప్పదు... అద్దాల మేడ ఉందీ... రండి బాబూ రండి. లక్షొస్తే ఏం చెయ్యాలో ఇప్పట్నించీ ప్లానేయండీ. రాపోతే నన్నడగండి... మత్తైన మందు ఉందీ, రా, రా,రా.... లక్ష్మి, లక్ష్మి సౌభాగ్యలక్ష్మి, రేపే డ్రా.... టిక్కెట్టు రూపాయి మాత్రమే! ఇక్కడ మా బండీ ఇంకో పదినిముషాలు మాత్రమే ఉంటుందండీ. ఆ తర్వాత విజయవిహార్ సెంటర్ కెళ్ళిపోతుంది. కావాల్సిన వాళ్లకు టికెట్లు బండి దగ్గరిస్తున్నారు. రండి బాబూ రండి.... ....''

★ ★ ★

''అందం చూడవయా, ఆనందించవయ్యా.. టప్... నవ్వుల్లో మల్లెలు! మాటల్లో ముత్యాలు! స్టెప్పుల్లో తిప్పుళ్లు... పాటకు పది చీరెలూ, పది పార్కులూ, మారుస్తూ ఫ్రెంచి దేశము యొక్క బూర్గుండీ వైను త్రాగి పాటపాడుతూ మన్మధమాలిని అతి స్వేచ్ఛగా చేసిన నాట్యాన్ని చూసి తరించనివాళ్ళుంటారా, చూడని వాళ్లకి స్వర్గం రుచి తెలుస్తుందా... అందం చూడవయా... ప్రేక్షక మహాశయులారా, పాట తర్వాత హీరో కంత్రలాల్‌తో కలిసి కొలనులో ఆమెచేసే ఆ స్నాన దృశ్యంఎంత అమోఘమైనదంటే, మీరింటికెళ్ళగానే అట్లాంటి స్నానం కోసమే వెంపరలాడతారు! హీరో గారు తన దోసిళ్లలో నీళ్లు హీరోయిన్‌మీద చల్లుతున్నప్పుడు కనిపించే ఆయన కండలు, కండలా అవి... కావు ఉక్కు బండలు! ఆ కండల్లో నరాలు నరాల్లో నీలాలు, ఆ కండల్లో కసి, ఫ్రేము ఫ్రేములోనూ వైనవైనంగా కనిపించే బలిసిన ఆయన తొడలు... ఒహో ఏం సౌందర్యం! పురుషుడంటే అట్లా ఉండాలి!... అందం చూడవయా, ఆనందిచవయా... ప్రపంచంలో ఎనిమిదో విచిత్రమైన ఫైటింగులు ఈ చిత్రానికే కాక, మొత్తం చిత్రరంగానికే హైలైటంటే మీరు నమ్మక తప్పదండీ, తప్పదు, క్షమించండి! వెరశి, మిమ్మల్ని అలరించి, నవ్వించి కవ్వించి, కదిలించి, కలవరింపచేసే చిత్రమండీ ఇదీ, ధన దాహం పిక్చర్స్‌వారి, ఏ సర్టిఫికెట్, సెవెంటీ ఎమ్మెమ్, ఈస్టమన్ కలర్, వెస్టెక్స్ సౌండ్ ఎక్కువ కుదుపు, తక్కువ సెన్సారింగ్, నూతన చిత్రం 'చూపిస్తా, చూపిస్తా, తడాఖా చూపిస్తాను' నేడే చూడండి బాబూ, మీ అభిమాన థియేటర్, రసిక రాజ్యం టాకీస్‌లో... అందం చూడవయా, ఆనందించవయ్యా... ఆడవాళ్లకోసం చేసే ప్రత్యేక సూర్యోదయం ఆటలు కూడా కలుపుకొని రోజుకు ఏడే ఆటలు ముఖ్య గమనిక! ఈ చిత్రంతో బాటుగా 'సంసారం' అనే ఏడు నిముషాల హాంకాంగ్ ఆడవాళ్ల సంసారాల రీలు ఉచితంగా చూపబడును... అందం చూడవయా... ఆనందించవయా... ఆగరా సన్నాసీ, ఇంకో రెండుమాట్లు

చెప్పనీ... ఇది కత్తిలాంటి సెంటర్రా నాన్నా... ప్రేక్షక మహాశయులారా, నవ్వుల్లో మల్లెలు!..''

★ ★ ★

''పాఁయ్, పాఁయ్, పాఁయ్... పంపం పంపం పాఁయ్ హోల్డాన్.. రమా మహల్ , రమా, రమా, రమా.. కిందకి దిగండి బాబూ.. వోవల్ రైట్ .. పాఁయ్, పాఁయ్‌పాఁయ్ .. డ్డబ్, డ్డబ్, డ్డబ్... తప్పుకో ఎహె.... నీకు రిక్షా డ్రైవరెవడిచ్చాడ్రా సొట్ట మొహం వొడ, ఇది నంబర్ ఫోర్ ఏలూరు సిటీబస్సు రథంరా నాన్నా, తప్పుకోకపోతే కొప్పూడిపోద్ది . రైట్, ఫ్షుష్, ఫ్షుష్! . .. పాఁయ్, పాఁయ్, పాఁయ్....''

''... శ్రీ వేంకటేశదయితే తవ సుప్రభాతమ్... ఆపెయ్యరా... భక్తమహాశయులకు విజ్ఞప్తి... సూటిచూసి ఈ సెంటర్లో మనం పర్మినెంటు గుడి కట్టేసుకున్నాం... దిగ్విజయంగా శ్రీకృష్ణమూర్తులవారి ఉత్సవాలు జరుపుకొంటున్నాం.. ఆ వెన్న దొంగని, ఆ మురళీ లోలుణ్ని, ఆ గోపికా రసికుణ్ణి, ఆ రాధా మానసచోరుణ్ణి, ఆ చీరెలెత్తుకుపోయినవాణ్ణి, మనకు భూములూ డబ్బూ, నగా,నట్రా, మంచి ఉద్యోగాలు ఇవ్వాలని మనసారా కోరుకుంటూ కొలుచుకుంటున్నాం. ఈ మైకులకూ, పూజలు వగైరాల ఖర్చుల నిమిత్తం వచ్చిన విరాళాలు, చదువుతున్నాను. కర్రల వెర్రోడు గారు అర్ధరూపాయి, తాటాకుల తాతబ్బాయిగారు తొంభై పైసలు... ఒంటికన్ను విశాలాక్షి గారు వెయ్యి అని చెప్పమన్నారు- పైసలే లెండి... ఒక భక్తుడు శ్రీవారి మెళ్లో ఇవ్వాళ వేసిన దండ... అయ్యా ఇవ్వి విరాళాలు. భక్తులారా ఈ రాత్రంతా భజన జరుగుతుంది. అందరూ రా ప్రార్థన... ఏసెయ్‌రా రికార్డేసెయ్... హరిః ఒం కౌసల్యా సుప్రజారామ...''

''యేసు నామమె జీవనము, యేసు పాదమె పావనము, యేసే రక్షణ కారణము... పాపులైన ప్రజలారా, మీకు మనస్సు పొంది పాపక్షమాపణము నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున ఎవడు ను బాప్తీస్మము పొందుడి- అపోస్తలు రెండు ఇరవై ఎనిమిది... యేసు నామమే జీవనము...మారు మనస్సు పొంది సువార్త నమ్ముడని దేవుని సువార్త ప్రకటించెను. అప్పుడు యేసు గవిలయకు వచ్చెను- మార్కు ఒకటీ పదిహేను. ప్రజలారా యేసు యొద్దకు వచ్చి మీ పాపములు ఒప్పుకొనుడి, పరిశుద్ధులు అగుడి. మీ స్వస్తతకొరకై మేము ప్రార్థన చేసెదము... యేసు నామమె జీవనము...''

★ ★ ★

''ఈ భూమిలో పుట్టినందుకు బాబూ తిండీ గుడ్డా లేకపోతే పీడాపాయె, కనీసం మనస్సుకు ప్రశాంతతయినా మాకు దక్కనివ్వరా లీడరు బాబూ! ఈ అడ్వర్టయిజ్‌మెంట్లేమిటి, ఈ అమ్మకాలేవిటి! భయంకరమైన ఈ మైకు భక్తేమిటి! అసలు నాల్గురోడ్లనడుమ సెంటర్లో ఈ గుడేమిటి? లేచిం దగ్గర్నుంచీ పడుకోబోయేదాకా గుండెలు అవిసి పోయేలాగా మాకక్కర్లేని సౌండ్లేమిటి బాబూ! ఈ సౌండ్ల మూలంగా వృధాఖర్చెందుకని మా ఇంట్లోరేడియోలు కూడా కట్టేసుకోవలసొస్తోంది. మమ్మల్ని చెవుల్లో సీసం పోసేసుకోమంటారా, లేకపోతే పిచ్చెక దాకా ఆగి ఏకంగా చచ్చే పొమ్మంటారా! మా ఇళ్ళల్లో మేమే సంజ్ఞల్తోనే మాట్లాడుకోవాలనా మీ ముచ్చట! స్కూళ్లల్లోనూ కాలేజీల్లోనూ చదువెట్టాగూ లేదు, కనీసం మా ఇళ్లల్లో మేము చెప్పుకోవటం కూడా తమకు ఈర్ష్యగానే ఉందా స్వామీ? సరే, మీకు వోటేసి మిమ్మల్ని కౌన్సిలరు చేస్తామయ్యా, మాబోటి వాళ్లకు ఈ చిత్రహింస నుంచి విముక్తిగానీ, షాపులోంచిగానీ బయటికి సౌండు వినిపించనివ్వమని మాటివ్వగలరా?... మాకు తెలుసు, మీరివ్వలేరు. ఎందుకో చెప్పమా,

నిరక్షరాస్యులూ, అసంస్కారులూ, కుసంస్కారులూ, వీళ్లు మీ ఆయువుపట్టు! జనాలు అట్లా ఉండటమే వాళ్లని అట్లా ఉంచటమే మీకు ఆనందం, అవసరం కూడా!... మీ ఈ పాలసీని మేము ఆమోదిస్తే మేము- అంటే ఈ వార్డు వాళ్లం- అందరమూ మీకు మంచి వాళ్లం! లేకపోతే మీకు విరోధులం! అభివృద్ధి విరోధులం! బడుగువర్గాల కడుపు కొట్టేవాళ్లం! అంతే కదూ!... అయినా సరే, వెళ్ళండి బాబూ వెళ్ళండి,వెళ్ళి ఇంకో వార్డులో నుంచోండి అక్కడ గుమ్మాల్లో అడుక్కోండి. మాకా హామీ ఇచ్చేదాకా మా గుమ్మా లెక్కకండి!''

(క్రోక్విల్ హాస్యప్రియ నవంబర్ 86.)

* * *   * * *   * * *

# లారీలో ఏముంది?

డీసెంబరు నెలలో ఒక ఉదయం వేళ సుమారుగా ఎనిమిది గంటలవుతోంది. చిరు చలితెరలు వాతావరణాన్ని ఇంకా వదల్లేదు.

ఉప్పల్ హైవే నంబర్ ఫైవ్‌లో, లోడ్‌తో ఉన్న ఒక లారీ, బరంపురం నుంచి వస్తూ ఇచ్ఛాపురం వైపు...( ఆంధ్రప్రదేశ్‌లో) ఉన్న ఆంధ్రచెక్ పోస్ట్ గేటు దగ్గరకు వచ్చి, అంతకుముందే అక్కడ ఆగి ఉన్న పెట్రోలు టాంకర్ వెనకాల ఆగింది. లారీ కాబినులోంచి పుస్తకంతో డ్రైవరు దిగాడు. వేగంగా పాకలోకి వెళ్ళి చెకింగు గుమాస్తా బల్లమీద పుస్తకం పడేసి నుంచున్నాడు.

చెక్కింగు గుమాస్తా తన మఫ్లరును సరిచేసుకుని, తాపీగా సిగరెట్టు తీసి అంటించుకుని, డ్రైవరు వైపు చూస్తూ అడిగాడు.

'' ఎక్కడ్నుంచేటి?''

డ్రైవరు చాలా టూకీగా సమాధానం చెప్పాడు.''బరంపురం''

''లోడేటి?''.. '' సోప్ పౌడరు''.. '' ఎంత లోడు?'' ... '' వే బిల్లులో ఉంది.'' కట్టె విరిచినట్టు వేగంగా వస్తున్న సమాధానాల్ని చూసి గుమాస్తా డ్రైవరు ముఖంలోకి పరిశీలనగా చూశాడు. డ్రైవరుకు పాతికేళ్లకంటే ఎక్కువ వయస్సుండదు. వదులు కాకి పాంటూ, వదులు కాకి చొక్కా, నెత్తిన తిరపతి టోపీ, వీటితో అతను కొంచెం చిత్రంగా ఉన్నాడు. రంగు చామన ఛాయ.

గుమాస్తా రోడ్ వైపు చూస్తూ, ' అరే పట్నాయక్, చీకుతో లోడ్ చెక్ చెయ్యరా '' అన్నాడు. ('చీకు'- ఇంగ్లిషు సీకర్' ఒక కొన సూదిగా ఉంటూ, సుమారు గజమున్నర పొడుగు ఉండే ఇనుప గొట్టం)

రోడ్డు మీద, చీకు మీద గడ్డంఆనించినుంచొన్న ఆ పట్నాయక్ అన్నవాడు '' యస్‌సార్'' అంటూ నడిచి, లారీ ఎక్కి దాని మీద కప్పిన టార్పాలిన్ ను ఒక పక్కన వూడదీసి లోపలికి చూశాడు అన్నీ దేవదారు చెక్కకేసులే.

వాడు తన 'చీకు' తో పొడుస్తూ అంతటాపరీక్షిస్తున్నాడు. క్లీనరు కూడా కిందికి దిగాడు. చేతులు కట్టుకుని కాటిన్‌ను అనుకుని నిలుచుని పాక వైపు చూస్తున్నాడు. అతను కూడా వదులు కాకీ పాంటే